
# డైరెక్టర్

- సింహప్రసాద్



"నో...నో! అలా కాదు. ఆమె నడుముని సున్నితంగా నొక్కుతూ తమకంతో ఆమె బొడ్డుమీద ముద్దు పెట్టుకోవాలి. తర్వాత కొంచెం పైన ఇంకొంచెం పైన. ఆమె వక్షానికి మొహం రాస్తూ పైకి లేచి మెడమీద ముద్దులు కురిపిస్తూ గుండెలకి హత్తుకోవాలి. ఓకే!" వివరించాడు డైరెక్టర్ భూషణ్.

ఇబ్బందిగా చూస్తూ తలాడించాడు బాబు.

పందొమ్మిదేళ్ల బాబుకిది తొలి సినిమా. అంచేత కాస్త కంగారుగా ఉంది. దానికితోడు హీరోయిన్‌తో క్లోజ్‌గా ఉండే సన్నివేశం చిత్రీకరిస్తున్నారేమో, మరీ ఇబ్బందిగా ఉంది.

అది చాలదన్నట్టు అసలే పరువాలతో పిచ్చెక్కించేలా ఉన్న హీరోయిన్ స్విమ్మింగ్ డ్రెస్‌లో ఉందాయె!

"రెడీ.... కెమెరా ఆన్! యాక్షన్!!" అరిచాడు డైరెక్టర్.

ఆయనకీ సినిమా ఓ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్. ఎలాగైనా దీన్ని సూపర్ హిట్ చేసి, బాబు బంగారు భవిష్యత్తుకి బాట వేయాలని ఆశిస్తున్నాడాయన. అందుకే

టీనేజ్ యువతీ యువకుల ప్రేమ బాసల్ని, వేడిని, తపనని కాస్త సెక్సీగానే చిత్రీకరిస్తున్నాడు. బాబుని రొమాంటిక్ హీరోగా తీర్చిదిద్దాలని ఆరాటపడుతున్నాడు. సినిమాక్కూడా 'లవర్ బోయ్' అని పేరు పెట్టారు.

క్లాప్ కొట్టగానే హీరోయిన్ స్విమ్మింగ్ పూల్‌లోంచి మెట్లెక్కి బయటకొచ్చింది.

మోకాళ్ల మీద కూర్చుని ఆమెవంకే చూస్తున్నాడు బాబు.

ఇద్దరికీ మధ్య రెండడుగుల దూరమే ఉంది. తడిసిన స్విమ్ సూట్‌లోంచి ఆమె అందాలు కనువిందు చేస్తున్నాయి. ఆమె తెల్లని శరీరం మెరిసిపోతోంది.

ఏదో తెలియని అలజడి మొదలైందతడిలో.

ఆమె అతడ్ని చూసింది. అల్లరిగా నవ్వింది. సమీపించింది.

చటుక్కున ఆమె నడుంచుట్టూ చేతులేసి మీదకి లాక్కున్నాడు. కిలకిలా నవ్వింది. అనాచ్ఛాదితంగా ఉన్న బొడ్డుమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె పెదవి కొరుక్కుంది. మెల్లమెల్లగా పైకి లేస్తూ ముద్దులు పెడుతూ ....

"కట్!" అసంతృప్తితో రగుల్తూ అరిచాడు భూషణ్.

అప్పటికే ఎర్రబడిన మోముతో ఉన్న బాబు తప్పు చేసినట్లు ఫీలయ్యాడు. హీరోయిన్ దూరంగా జరిగింది.

"అలా బిగుసుకుపోతావేం, బాబూ! ఫ్రీగా ఉండాలి. ఎక్స్‌ప్రెషన్ రొమాంటిగ్గా ఉండాలి. మొదటిసారిగా అందాలు చూసినట్లు చూడాలి. తొలి ముద్దు పెట్టుకున్నట్టు పెట్టుకోవాలి. ఆర్తితో, ఆవేశంతో అల్లుకుపోవాలి. నువ్వు నటించడంలేదు, నిజంగా అలా చేస్తున్నావనే ఊహించుకో! అప్పుడు మొహంలో భావాలు బాగా పలుకుతాయి. లేకపోతే ఉడెన్ ఫేస్ అని ముద్ర కొట్టేస్తారు, జాగ్రత్త!" అన్నాడాయన.

తలాడించాడు బాబు.

"చూడమ్మాయ్! బాబు కెమెరాకి కొత్త కదా! కాస్త బెరుగ్గా ఉంటుంది. నువ్వు కోఆపరేట్ చేస్తూ కవర్ చేసుకుపోతూండు!" హీరోయిన్ని పిలిచి చెప్పాడు.

"ఓకే, సార్!" అంది రమణి.

మళ్లీ షాట్ చిత్రీకరణ మొదలైంది.

హీరోయిన్ మళ్లీ స్విమ్మింగ్ పూల్‌లోంచి ... బాబు మళ్లీ బొడ్డు మీది ముద్దు దగ్గర్నుంచి ....


షాట్ ఓకే చేశాడు డైరెక్టర్.

తప్పట్లు కొట్టారు సెట్లో ఉన్న వారంతా.

గుటకలు మింగుతూ ఓ పక్కకెళ్లి కూర్చున్నాడు బాబు. ఓ అసిస్టెంట్ టర్కీ టవల్‌తో వచ్చి మేకప్ చెదరకుండా పైపైన అద్దుతూ తుడిచాడు.

బాబు గుండెలింకా అదురుతూనే ఉన్నాయి.

ఒకమ్మాయితో అంత క్లోజ్‌గా ఉండటం .... అలా ముద్దు పెట్టుకోవడం, కౌగలించుకోవడం అదే ప్రథమం. అంతా ముఖ్యంగా భూషణ్‌గారు చూస్తూండగా అలా



చేసినందుకు సిగ్గుగా, గిల్టీగా ఉంది. అదే సమయంలో ఆ అనుభవం ఎగ్జైటింగ్‌గా ఉంది. నరాల్ని ఉద్రేకపరుస్తుంటే మొఖం జేవురించసాగింది.

పేకప్ చెప్పాక బాబుని పిలిచాడు భూషణ్.

"ఇది నీ లాంచింగ్ ఫిల్మ్. సినిమా పేరులానే లవర్‌బోయ్‌లా ఉండాలి. తెరమీద నిన్ను చూడగానే ఫ్రెష్‌గా నేచురల్‌గా రొమాంటిగ్గా లవ్లీగా ఉన్నాడని ఆడియన్స్ ఫీలవ్వాలి. అలా ఫీలయ్యారంటే చాలు, సినిమా జాక్‌పాట్ కొట్టినట్టే. ఆ అమ్మాయి గురించేం ఇదవ్వకు. ఆమె ఏమీ అనుకోదులే. నీ ఇష్టం వచ్చినట్లు అల్లుకుపో, చుట్టుకుపో! తెలిసిందా? ప్రతి సీనూ లవ్లీగా ఉండాలి. నేచురల్‌గా ఉండాలి!"

తలాడించాడు.

అసిస్టెంట్ డైరెక్టర్ని పిలిచి, "రేపటి సీనేవిటి?" అనడిగాడు.

"ఫస్ట్ నైట్ సీన్, సార్!"

"ఇంటర్వెల్‌కి ముందు హీరో ఊహించుకునే సీన్ అన్న మాట. కథను మలుపు తిప్పే ముఖ్యమైన సీన్. చాలా బాగా రావాలి. ఇంటిదగ్గర అద్దంలో చూసుకుంటూ నీకు నువ్వే రిహార్సిల్స్ వేసుకో! సినిమాల్లో వచ్చిన అలాంటి సీన్లలో హీరోలెలా నటించారో వీలైతే పరిశీలించు!"

ఇంకా ఏదో చెప్పబోతుంటే, "ఫ్లయిట్‌కి టైమవుతోంది, సార్!" అన్నాడు పి.ఏ.

"నేను చెన్నై వెళ్లి రేపు మార్నింగ్ ఫ్లయిట్‌కి వచ్చేస్తాను. రేపటి షూటింగ్ ఏర్పాట్లు జాగ్రత్తగా చెయ్యి!" అని ప్రొడక్షన్ మేనేజర్‌కి చెప్పి వెళ్లిపోయాడు భూషణ్.

బాబుకోసం కారు వచ్చింది.

"హీరోయిన్ డ్రెస్సప్ అవుతోంది. కొంచెం ఆగితే, ఆవిడ్ని కూడా కారులో హోటల్ దగ్గర డ్రాప్ చెయ్యచ్చు!" ప్రొడక్షన్ మేనేజర్ అన్నాడు.

అంగీకరించాడు బాబు.

రమణీ, ఆమె తల్లి వచ్చి కారు ఎక్కారు. రమణి చీర కట్టుకుని డిగ్నిఫైడ్‌గా ఉంది. ఆమెవంక చూడటానికి సిగ్గెయ్యగా తల తిప్పుకుని ముందు సీట్లో కూర్చున్నాడు బాబు.

"అరెరె ... మీరు ముందేమిటీ, వెనకాల కూర్చోండి, సార్! డైరెక్టర్‌గారికి తెలిసిందంటే చంపేస్తారు!"

ప్రొడక్షన్ మేనేజర్ గోల పెట్టాడు కానీ, బాబు పట్టించుకోలేదు.

కారు కదిలింది.

"నువ్వు నిండా బాగా చేస్తివబ్బా! మీ జోడీ రొంబ బాగుండాది!" తెలుగు తమిళంలో దారి పొడవునా ఏదేదో చెబుతూనే ఉంది రమణి తల్లి. బాబును ప్రశంసలతో ముంచెత్తుతూనే ఉంది.

హోటల్‌కెళ్లారు. ఇద్దరివీ పక్కపక్క గదులే.

మరో గంటకొచ్చాడు కోడైరెక్టర్ విఠల్.

"ఇవాళెలా చేశాను?" సందేహిస్తూనే అడిగాడు బాబు. అతనితోనే కొంచెం క్లోజ్‌గా మూవ్ అవుతూంటాడు బాబు.

"పెద్ద హీరోలా చేశావు గురూ! సీన్ భలే పండిందిలే!" పొగిడేశాడు విఠల్.

బాబునీ, భూషణ్‌గారినీ బాగా కాకా పట్టి ఎలాగోలా ఓ సినిమాని డైరెక్ట్ చేసే ఛాన్స్ కొట్టేయాలని అతడి తాపత్రయం.

"నాకు చాలా టెన్షన్‌గా ఉంది."

నవ్వేశాడు విఠల్. "ఈ మాత్రానికే! ఇంకా జలపాతం దగ్గర స్నానాలూ అవీ ఉన్నాయి, గురూ! యూత్‌ని ఆకర్షించాలంటే సెక్సూ, సంగీతం కొంచెం మోతాదు మించి ఉండాల్సిందే. తప్పదు!"

"నాకు మాత్రం ఆందోళనగా ఉంది..." దిగులుగా అన్నాడు.

"డోంట్ వర్రీ గురూ! మన డైరెక్టరుగారి చెయ్యి పడితే చాలు, పిక్చర్ సూపర్ హిట్టే! హీరోయిన్ని కొత్తగా, అందంగా పిచ్చెక్కించేలా చూపించడంలో మన డైరెక్టర్‌గారికి సాటి మరొకరు లేరనుకో! అందుకే ఆయన డైరెక్షన్లో నటించాలని కుర్ర హీరోయిన్లంతా తెగ ఉబలాట పడు... ...గు."

"కొంచెం ..సిగా ఉంటే ఆమె ఏమీ అనుకోదు కదా!"

"ఎవరు? రమణా! భలేవాడివి గురూ!" అని గట్టిగా నవ్వేశాడు. "అలా అనుకునేవాళ్లూ, మడిగట్టుకుని కూర్చునేవాళ్లూ ఈ ఫీల్డుకే రారు! అసలు నీ ఫీలింగ్స్ ఇంకా నేచురల్‌గా ఉండాలంటే ఓసారి ఆ అనుభవం చవిచూసెయ్యాలి గురూ!"

"మా డాడీకి తెలిస్తే చంపేస్తారు!"

"తెలియకుండా ఏర్పాటు చేస్తానుగా!"

"అమ్మో .... నాకు భయమేస్తోంది!"

"హీరోవి. నీకు భయమేమిటి, గురూ! పైగా అమ్మాయికోసం వెతుక్కోనక్కర్లేదు. రమణితో చెబితే ఎగిరి గంతేస్తుంది!"

"మన రమణి...?"

"మన రమణే!" నవ్వాడు.

"నాకేవిటో దడగా ఉంది."

"అవన్నీ పోతాయి. సిగ్గూ, సంకోచమూ పోయి ఫ్రీగా చేస్తావు. ఈ సినిమా సక్సెస్ మీదే నీ నటనా భవిష్యత్తూ, మీ డాడీ కలలూ ఆధారపడి ఉన్నాయి. నువ్వేం ఇదవ్వకు. నేను అరేంజ్ చేస్తాగా! సరదాగా అలా బజార్లో తిరిగి డిస్కో థెక్ వెళ్లివద్దురుగాని. ఇద్దరికీ భోజనం గదిలోనే ఏర్పాటు చేయిస్తాను. ఆ తర్వాత మీ ఇష్టం!"

"కానీ రమణి వాళ్లమ్మ ...?"

"డోంట్ వర్రీ యార్! ఆవిడ ఇంకో అరగంటకి పీకమొయ్యా తాగి శవంలా పడుంటుంది. ఫ్రీగా వస్తే ఏదైనా తాగేసే రకంలే!"

అతడెటూ చెప్పకపోయేసరికి, "నువ్వు రెడీ అవ్వు గురూ!" అనేసి బయటకెళ్లాడు విఠల్.

బాబు పరిస్థితి చిత్రంగా ఉంది. ఒకపక్క ఆ అనుభవం కావాలని ఆరాటం, మరోపక్క ఏమవుతుందోనని భయం. ఇంకోపక్క ఆమె ఏమనుకుంటుందోనని సంకోచం!

అయిదు నిమిషాల్లో వచ్చాడు విఠల్. "ఇంకా రెడీ కాలేదా?"

"ఒప్పుకుందా?"

"లైన్ క్లియర్ చెయ్యకుండా వస్తానా? బయల్దేరు, గురూ! నా సాయం మర్చిపోకు సుమా!"

"భలేవాడివే! డాడీకి చెప్పి గోల్డెన్ ఛాన్స్ ఇప్పించే పూచీ నాది!"


మరి పది నిమిషాలకి బాబూ, రమణీ చక్కగా తయారై టాక్సీలో బయలుదేరారు. అతడికి రాసుకుని కూర్చుని అతడి భుజంమీద తల వాల్చిందామె. ఆమె పరువాల తాకిడికి ఉక్కిరిబిక్కిరవుతూ గుండెని చిక్కబట్టుకున్నాడు బాబు.

"డిస్కో థెక్ వెళ్దాం!" రమణి అంది.

"ఓకే!"

బాబు ఓ సినీ ప్రముఖుడి పుత్రరత్నం. కోట్లకి వారసుడు. అలాటివాడ్ని వలలో వేసుకుంటే మరి వెనుతిరిగి చూడక్కర్లేదనీ, భవిష్యత్తు గురించి చింత ఉండదనీ బయలుదేరుతుంటే రమణికి తల్లి నూరిపోసింది.

రమణి తమిళ, మలయాళ సినిమాల్లో ఏవో బుల్లి వేషాలేసింది కానీ గుర్తింపు రాలేదు. భూషణ్ గారిని వేషంకోసం కలవడమూ, కొత్త హీరోయిన్



# సాహిత్య కబుర్లు

## తిండి కవిత్వం!

కవులు కూడా మనలాంటి వాళ్లే కదా! వాళ్లకే తిండి వ్యామోహం వుండదా? వాళ్లకే ఇష్టాయిష్టాలుండవా? తమతమ అభిరుచులకి అనుగుణంగా తమ కిష్టమైన వాటిని మెచ్చుకుంటూ పద్యాలూ, పాటలూ అల్లేశారు. కొందరు భోజన పదార్థాలను పొగుడితే, మరికొందరు పిండివంటల్ని పొగుడుతూ కవిత్వం చెప్పారు. కొందరి తిండికవిత్వం చూస్తే ఈ కవులకి వంట కూడా బాగా వచ్చనీ, నలభీమపాక ప్రవీణులనీ అనిపిస్తుంది కూడా!

శ్రీనాథుడికి సన్నబియ్యపుటన్నం అంటే ఇష్టం. కానీ పల్నాడు వెళ్లినప్పుడు అతగాడికి జొన్నన్నమే దొరికింది. విసుక్కున్నాడు. కోపమూ వచ్చింది. శ్రీకృష్ణుణ్ని "జొన్నకూటితో మెల్లననొక్క ముద్ద దిగమ్రింగుము నీ పసగాననచ్చెడిన్" అని నిలదీశాడు. పైగా "పూతన చనుబాలు తాగి పెద్ద హీరో అయిపోయావే! ఈ అన్నం తిను. దెబ్బకి ఠారెత్తిపోతావ్!" అని సవాలు విసిరాడు. ఒక్క రూపాయికి ఆ రోజుల్లో మాంఛి భోజనం లభించేదని మెచ్చుకున్నాడు శ్రీనాథుడు.

తెలుగు వాళ్లకి కొన్ని ప్రత్యేకమైన వంటకాలున్నాయి. వాటి రుచులు అమోఘం. తెలుగువాళ్ల స్పెషల్స్‌లో వంకాయకూర ఒకటి. ఓ కవి వంకాయ వంటి కూర లేదన్నాడు. పైగా సీత వంటి స్త్రీతోనూ, శివుడివంటి దేవుడితోనూ, శ్రీరామచంద్రుని తోనూ సమానమంటాడు. అంతటి గొప్పదంటాడు. ఇంతకీ ఈయన చెప్పిన వంకాయకూర గుత్తి వంకాయకూరా? అల్లం కూరా? ధనియాల కారం పెట్టిన కూరా? ఏ కూరైనా వంకాయకూరే! అలాగే పకోడీ మీద చాలామంది పద్యాలు చెప్పారు. అఘుమఘుమలు, ఆ రుచి ఎక్కడా లేదన్నారు. అల్లం, పచ్చిమిరపకాయలు వేస్తే అమోఘమని ఒక కవి అంటే, ఉల్లిపాయ పకోడీయే పకోడీ అన్నాడు మరో కవి. చిలకమర్తి వారు స్త్రీల పలుకులలోనే అమృతం ఉందనటం నిజం కాదనీ, పకోడీలోనే అమృతం ఉందనీ సెలవిచ్చారు. ఆంధ్రులకి ఇంతకంటే అత్యంత ప్రీతిపాత్రమైనవి రెండున్నాయి. గోంగూర, ఆవకాయ! ఆవకాయ మీద చాలామంది సీసాలు(సీసపద్యాలు) అందించారు.

"పిండీ మధురమ్ ముక్కా మధురమ్ / పాతదే మధురమ్ కొత్తదే మధురమ్" అని పాటలు కూడా వెలువడ్డాయి. సహస్రావధాని గరికపాటి నరసింహారావు " అతివ నడుమైన జాడీయే ఆవకాయ ఆంధ్రమాత సింధూరమ్మో ఆవకాయ ఆంధ్రదేశమ్మో తానొక్క ఆవకాయ..." అని పలువిధాలుగా కీర్తించారు.

ద్వానాశాస్త్రి

---

కోసం అన్వేషిస్తున్న ఆయనకామె నచ్చడమూ, హీరోయిన్ అయిపోవడమూ గబగబా జరిగిపోయాయి.

ఈ సినిమా హిట్ అయితే ఎన్నో అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. ఫట్‌మంటే ...! అందుకే బాబును ఆకట్టుకుంటే ఇక తనకి తిరుగుండదని విశ్వసిస్తోంది రమణి. ఆ దిశగా అవాళ తొలి అడుగు వేయాలని నిశ్చయించుకుంది.

స్టార్ హోటల్లోని డిస్కోథెక్‌కి వెళ్లారు.

ఎందరో యువతీ యువకులు జంటలుగా వచ్చి కొంచెంగా డ్రింక్ చేసి వెర్రిగా ఊగిపోతూ డాన్స్ చేస్తున్నారు. రమణి ప్రోత్సాహంతో బాబు కూఢా చెలరేగిపోయాడు.

అనంతరం హోటల్లో భోంచేసి రూమ్‌కి చేరుకున్నారు. వారికోసం బాల్కనీలో కాచుక్కూచున్నాడు విఠల్. "మీ ఇద్దరికీ బాబు రూమ్‌లో భోజనం ఏర్పాట్లు చేశాను!" అన్నాడు.

"హోటల్లో భోం చేశాం!" బాబు చెప్పాడు.

"ఫర్లేదు, కాసేపు స్పెండ్ చేయండి. విష్ యూ ఆల్ ద బెస్ట్!"

అతడి భావం అర్థమయ్యేసరికి బాబు రక్తనాళాల్లో రక్తం పరుగు పెట్టసాగింది.

గదిలోకెళ్తూనే అతడ్ని చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

"రేపటి శోభనం సీన్‌కి రిహార్సిల్స్ చేసుకోమన్నారుగా డైరెక్టరుగారు!" అని నవ్వుతూ రెచ్చగొట్టింది. ముగ్గులోకి దింపేసింది. బాబుకి రతి క్రీడలోని రసమయపుటంచుల్ని చూపింది.

తొలి అనుభవాన్నీ, ఆ అనుభవాన్నిచ్చిన పార్టనర్‌నీ ఎవరూ మరచిపోలేరని రమణికి బాగా తెలుసు.

బాబు దృష్టిలో ఆమె ఇప్పుడు,మన్మథ సామ్రాజ్యపు యువరాణి!

మర్నాడు శోభనం సీన్ చిత్రీకరించారు.

బాబు కొంచెం చొరవగా, ధైర్యంగా, ఉత్సాహంగా చేశాడు.

అభినందనలతో ముంచెత్తాడు భూషణ్. "గుడ్ ప్రోగ్రెస్! కీపిటప్! ఇలాగే ఇంత రొమాంటిగ్గానే నటిస్తే టీనేజ్ అమ్మాయిల స్వప్నసుందరుడివైపోతావ్! వెంటనే ఇదే సినిమాని హిందీలో తీసేసి ఆలిండియా స్టార్‌ని చేసేస్తాను. ఒకనాడు రాజేష్‌ఖన్నాకీ, ఇప్పుడు షారూఖ్ ఖాన్‌కీ వచ్చిన క్రేజ్ నీకొచ్చి తీరుతుంది!"

చటుక్కున వంగి ఆయన కాళ్లకి నమస్కరించాడు.

"విష్ యూ గ్రేట్ కెరీర్ మై బోయ్!" అన్నాడాయన చెమర్చిన కళ్లతో.

ఆ సాయంత్రం షూటింగయ్యాక బయటికెళ్దామంటూ స్వయంగా బాబే రమణిని పిలిచాడు. ముసిముసిగా నవ్వుతూ అంగీకరించింది.

బజారుకు తీసుకెళ్లి క్రెడిట్ కార్డ్ మీద రవ్వల నక్లెస్ కొని ప్రెజెంట్ చేశాడామెకు. వేనోళ్ల పొగిడేసిందతడ్ని. ఎవరూ చూడకుండా ముద్దు పెట్టేసుకుందికూడా.

అవాళ కూడా మన్మథ సామ్రాజ్యానికి యువరాజ పట్టాభిషేకం చేసింది.

అవతల షూటింగ్ ... ఇవతల వీరి కామకలాపాలు నిర్విఘ్నంగా సాగిపోయాయి.

అనుకున్న దానికన్నా ముందుగానే షూటింగ్ పూర్తయింది. రషెస్ చూసి పొంగిపోయారు భూషణ్.

బాబు చాలా బాగా చేశాడు.

ప్రేమించిన యువతికోసం తల్లిదండ్రుల్ని ఎదిరించి మరీ పెళ్లాడిన యువకుడిగా చక్కగా నటించాడు. లవర్‌బోయ్‌గా చాక్లెట్ ఫేస్‌తో సరదాగా, లవ్లీగా ఉన్నాడు. హీరోయిన్‌తో కలిసి శృంగార దృశ్యాలను నిజంగా పండించాడు. ఆ మత్తు చూపులు, చేష్టలు, తపనలు, తాపాలు .... అన్నీ నిజమేనేమో అని భ్రమించేలా ఉన్నాయి.

బాబునీ, రమణినీ పదేపదే అభినందించారు. షూటింగ్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా ఘనమైన పార్టీ ఏర్పాటు చేశాడు భూషణ్. 'లవర్ బోయ్' సినిమాకి పనిచేసినవారంతా వచ్చారు.

కానీ రమణీ, బాబూ రాలేదు.

"ఏరి? ఎక్కడ?" నుదురు ముడివేస్తూ గర్జించాడు భూషణ్.

విఠల్ చేతులు నలుపుకుంటూ బెరుగ్గా వచ్చి బాంబు పేల్చాడు.

పెళ్లి చేసుకోడానికి బాబు, రమణి ఎక్కడికో పారిపోయారట! వారి పెళ్లికి అంగీకరిస్తే తప్ప తిరిగి రామని చెప్పారట!

నిలువునా స్థాణువైపోయాడు భూషణ్.

"దాని మైకంలో అంతలా కూరుకుపోయాడా? సరిగ్గా మీసాలు కూడా మొలవని వీడు ...." ఆ పైన మాటలు పెగల్లేదు.

కళ్లముందు బాబు నటించిన దృశ్యాలు కదిలాయి. తను చేసిన సూచనలూ, ఇచ్చిన డైరెక్షనూ గుర్తొచ్చాయి.

తల పట్టుకు కూలబడ్డాడు.

ఆయన ఆ సినిమాకి డైరెక్టరే కాదు, బాబుకి కన్న తండ్రి కూడా!

■